ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



భానుడి భగభగలు

17 జిల్లాలకు హెచ్చరిక ● 5 రోజుల పాటు ఎల్లో అలెర్ట్ ● మే 2 వరకు ఇదే పరిస్థితి



చెన్నై జీమనాంపేట సబర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జే రాధాకృష్ణన్

అడయార్, ఏప్రిల్ 28: రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. మున్ముందు సాధారణం కంటే మూడ నుంచి 5 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రంలోని 17 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఈ హెచ్చరిక రానున్న 5 రోజుల పాటు కొనసాగనుంది. అంతేకాకుండా, మే 2 వరకు గరిష్ట స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని రోజులుగా ఎండలు తీవ్ర స్థాయిలో మండిపోతున్నాయి. పలు ప్రాంతాల్లో 37.7 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ కారణంగా ప్రజలు పగటి పూట బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ నెలలోనే ఎండలు మండిపోతున్న విషయం తెల్సిందే. దీనికి కారణం పసిఫిక్ సముద్రతీరంలో నెలకొనివున్న ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మరికొన్ని రోజుల పాటు పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తూనే ఉంది. అదే సమయంలో రానున్న రోజుల్లో ఈ పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో రెండు నుంచి మూడు డిగ్రీల సెల్సియస్, కొన్ని ప్రాంతాల్లో 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మేరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో రాణిపేట, వేలూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, కళ్ళకుర్చి, సేలం, ఈరోడ్, నామక్కల్, పెరంబలూరు, అరియలూరు, కోయంబత్తూరు. తిరుపూరు, కరూర్, తిరుచ్చి, మదురై జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది.

సేలం రోడ్డుపై 'ఆఫ్ బాయిల్' వేసిన మహిళలు



పెరంబూర్, ఏప్రిల్ 28: సేలంలో ఓ మహిళ రోడ్డుపై ఆఫ్ బాయిల్ వేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సేలం జిల్లాలో కొద్దిరోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ బృందాదేవి హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ఈ నెల 23వ తేది పగటి ఉష్ణోగ్రత అత్యధికంగా 42.3 డిగ్రీలుగా నమోదైంది. ప్రజల ఎండ తీవ్రత తెలియజేసేలా ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న గోడపై ఇద్దరు వ్యక్తులు కోడి గుడ్లు పగులగొట్టి ఆఫ్ బాయిల్ వేయడం కలకలం రేపింది. వారిని పోలీసులు హెచ్చరించి పంపారు. ఈ నేపథ్యంలో, రోడ్డుపై ఓ మహిళ నూనె వేయడం, మరో మహిళ కోడిగుడ్డు పగులగొట్టి దానిపై వేసే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఎండ తీవ్రత కారణంగా ప్రజలు రోడ్లపై రావద్దని తెలిపేందుకు ఈ చర్యలకు పాల్పడినట్లు, మరే ఉద్ధేశం లేదని ఆ మహిళలు పేర్కొన్నారు.

శ్రీరంగం ఆలయంలో
చిత్తిరై ఉత్సవాలు ప్రారంభం





నంబెరుమాళ్ సమక్షంలో ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం శ్రీరంగం రంగనాథస్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం చిత్తిరై రథోత్సవాలు ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజాము 3.30 గంటలకు నంబెరుమాళ్ బయలుదేరి ధ్వజస్తంభమంటపానికి చేరుకున్నారు. ఉదయం 6 గంటలకు వైష్ణవ పండితులు, ఆలయ ప్రధానార్చకులు మంగళవాయిద్యాలు, వేలాదిమంది భక్తుల నడుమ ధ్వజస్తంభానికి పూజలు, దీపారాధన చేసారు. ఆ తర్వాత ధ్వజ పతకాన్ని ఎగురవేశారు. ధ్వజారోహణం అనంతరం నంబెరుమాళ్ బయలుదేరి అద్దాల మండపానికి చేరుకున్నారు. అక్కడ సాయంత్రం 4.30 నుంచి గంటసేపు భేరితాటనం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ఉభయ నాంచారులతో నంబెరుమాళ్ బయలుదేరి చిత్తిరై వీథుల్లో ఊరేగారు. రాత్రి 8.30 గంటలకు చందన మండపానికి చేరుకున్నారు. అక్కడి నుంచి బయలుదేరి రాత్రి తొమ్మిది గంటలకు యాగశాలకు చేరారు. అక్కడ నంబెరుమాళ్‌కు తిరుమంజనం నిర్వహించారు. సోమవారం ఉదయం వేకువజాము రెండు గంటలకు నంబెరుమాళ్ మళ్ళీ అద్దాల మండపంలో వేంచేయనున్నారు. సాయంత్రం కల్పవృక్షవాహనంలో, మంగళవారం ఉదయం సింహవాహనంలో, సాయంత్రం యాళివాహనంలో, మే ఒకటో తేదీ ఉదయం ద్విప్రభ వాహనంలో, సాయంత్రం గరుడవాహనంలో, మే 2 ఉదయం శేష వాహనంలో సాయంత్రం హనుమంత వాహనంలో మూడో తేదీ ఉదయం స్వర్ణ హంస వాహనంలో, సాయంత్రం గజవాహనంలో నంబెరుమాళ్ వేంచేసి చిత్తిరై వీధుల్లో ఊరేగనున్నారు.మే నాలుగున వరి ధాన్యాల కొలత ఉత్సవంలో స్వామివారు పాల్గొంటారు. ఐదో తేదీ ఉదయం రజత అశ్వవాహనంలో, సాయంత్రం స్వర్ణ అశ్వవాహనంలో ఊరేగనున్నారు. ఈ ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన చిత్తిరై రథోత్సవం మే ఆరున నిర్వహించనున్నారు. ఏడున సప్తావరణం నిర్వహిస్తారు. ఎనిమిదిన అధికార పల్లకీ వైభవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ మారియప్పన్ ఆలయ సూపరింటెండెంట్ వేల్‌మురుగన్ ఇతర అధికారులు తగు సదుపాయాలు కల్పించనున్నారు.

శభాష్ గుకేష్...



ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించిన చెస్ క్రీడాకారుడు గుకేష్‌కు రూ.75లక్షల ప్రోత్సాహక నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

మీంజూరులో
రౌడీ హతం



తల ఒకచోట, మొండెం మరోచోట లభ్యం

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పొన్నేరి సమీపం మీంజూరుకు చెందిన పేరొందిన రౌడీ దారుణహత్యకు గురయ్యాడు. అతడి తలను ఒక చోట, మొండెం మరో చోట పారవేసి హంతకులు పరారయ్యారు. ఆదివారం వేకువజాము మీంజూరు టీహెచ్ రోడ్డు గాంధీ రోడ్డు ప్రాంతంలో గోనెసంచిలో తలలేని మొండెం పడి ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ శవం పడి ఉన్న ప్రాంతానికి కాస్త దూరంలో అతడి తెగిన చేయి కూడా కనిపించింది. ఆదివారం వేకువజాము ఐదుగంటలకు ఆ ప్రాంతంలో వెళుతున్న పాదచారులు గోనెసంచిలో కట్టి ఉన్న ఆ శవాన్ని చూసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మీంజూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గోనెసంచి తెరచి చూడగా అందులో తలలేని మొండెం కనిపించడంతో పోలీసులు దిగ్భ్రాంతి చెందారు. శవానికి దూరంగా పడి ఉన్న చేతిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు గురైన ఆ యువకుడి వయస్సు 25 యేళ్లుగా నిర్ధారించారు. ఈ విషయం తెలిసిన ఆవడి డిప్యూటీ పోలీసు కమిషనర్ బాల కృష్ణన్, అసిస్టెంట్ కమిషనర్ రాజ్ రాబర్ట్, సీఐ కాళిరాజ్ ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ జరిపారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదైన వీడియో దృశ్యాలు సేకరించి విచారణ ప్రారంభించారు. నిత్యం జనసంచారం కలిగిన ఆ ప్రాంతంలో తలలేని మొండాన్ని గోనెసంచిలో కట్టి పడేసి పారిపోయిన హంతకుల ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో హత్యకు గురైన యువకుడు పొన్నేరి సమీపం వంజివాక్కం ప్రాంతానికి చెందిన అశ్విన్‌కుమార్ అని వెల్లడైంది. అశ్విన్‌కుమార్ రౌడీగా చలామణీ అవుతున్నాడని, అతడిపై పలు స్టేషన్లలో గంజాయి స్మగ్లింగ్ తదితర కేసులు నమోదై ఉన్నట్టు గుర్తించారు. మూడు నెలల క్రితమే అశ్విన్‌కుమార్ ఓ యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. అంతే కాకుండా హత్యకు ముందు అశ్విన్‌కుమార్‌ని అతడి అనుచరుడు అజయ్ ఎక్కడికో తీసుకెళ్ళాడని ఆ తర్వాతే అతడు హత్యకు గురయ్యాడని తెలుస్తోంది. ఇదిలా ఉండగా పోలీసుల గాలింపు చర్యల్లో అశ్విన్‌కుమార్ తల చోళవరం సమీపం పెరుంగావూరు కాలనీ శ్మశానంలో పడి ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. అశ్విన్‌కుమార్ అనుచరుడు అజయ్‌ని అరెస్టు చేస్తేనే ఈ హత్యకు గల కారణాలు వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న అజయ్ ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

నీలగిరి స్ట్రాంగ్‌రూమ్ వద్ద
నిఘా పెంచండి

● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్



ప్యారీస్, ఏప్రిల్ 28: నీలగిరిలో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూంలవద్ద నిఘా పెంచాలని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఎన్నికల కమిషన్‌ను కోరారు. నీలగిరి లోక్‌సభ నియోజకవర్గానికి ఈనెల 19న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎం, వీవీ ప్యాడ్‌లను భారీ పోలీసు బందోబస్తు మధ్య ఊటీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచి సీలు వేశారు. ఈ కళాశాల ప్రాంగణంలో చుట్టుపక్కల 24 గంటలు పారా మిలిటరీ బలగాలు, పోలీసులు పహారా కాస్తున్నారు. మరోవైపు కళాశాల చుట్టూ 163 సీసీ కెమెరాలు పొందుపరచి పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాజకీయ పార్టీల ఏజెంట్లకు కేటాయించిన గదిలోని సీసీ కెమెరా సాంకేతిక లోపంతో 20 నిమిషాల పాటు శనివారం ఆగిపోయింది. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న జిల్లా ఎన్నికల అధికారులు సీసీ కెమెరాలోని సాంకేతికలోపాన్ని సరిచేశారు. టీవీ స్క్రీన్‌లో ఏర్పడిన సాంకేతికలోపంగా గుర్తించారు. అయితే అందులో నమోదైన దృశ్యాలన్నీ అలాగే ఉన్నట్లు తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా, ఆదివారం నీలగిరిలోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన అనంతరం కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ అక్కడి నుంచి విమానంలో కోవై చేరుకున్నారు. అక్కడ అయన మీడియాతో మాట్లాడుతూ... ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు భద్రపరచి సీలువేసిన గదులపై ఎన్నికల కమిషన్ నిఘా పెంచాలన్నారు. నీలగిరి స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలో ఏర్పడిన సాంకేతిక లోపానికి కారణం చెప్పడం మాని, 24 గంటలు నిఘా పెంచాలన్నారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో బీజేపీ మద్దతుదారుల పేర్లు ఓటరు జాబితాలో గల్లంతయ్యాయని, ముఖ్యంగా, కోవై, దక్షిణ చెన్నై, నీలగిరి లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య తలెత్తిందని మురుగన్ తెలిపారు.

సమ్మర్ క్యాంపుల్లో
ఫీజుల వసూళ్లా...?

● ఎడప్పాడి పళనిస్వామి ఆగ్రహం



చలివేంద్రం ప్రారంభించి తర్బూజా ముక్కలు పంపిణీ చేస్తున్న పళనిస్వామి

ప్యారీస్, ఏప్రిల్ 28: రాష్ట్రంలో ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపుల్లో పాల్గొనే విద్యార్థుల నుంచి ఫీజు వసూలుచేయడంపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తీవ్రంగా ఖండించారు. సేలం జిల్లా ఎడప్పాడి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొంగనాపురం బస్టాండ్ సమీపంలో అన్నాడీఎంకే తరఫున ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఈపీఎస్ ప్రారంభించి ప్రజలకు పండ్లు, మజ్జిగ, శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడలపై అన్ని జిల్లాల వారీగా సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ ఇస్తున్నారని, ఈ శిక్షణకు 18 ఏళ్లలోపున్న విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ క్యాంపులో పాల్గొనే విద్యార్థుల నుంచి రూ.500 ఫీజు వసూలుచేయడం ఖండించదగ్గదన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌ల్లో పాల్గొంటున్న విద్యార్థులు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులని, వీరి నుంచి ఫీజు వసూలుచేయడం సరికాదన్నారు. క్రీడల్లో ఆసక్తి పెంచుకున్న విద్యార్థులను ఆ రంగంలో రాణించేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, సమ్మర్ క్యాంప్ ఫీజు వసూళ్లను తక్షణం నిలిపివేయాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.





ఏవీ దక్షిణామూర్తికి పండిత సత్కారం - సభకు హాజరైన నగర ప్రముఖులు, తెలుగువారు

ప్రాచీన సాహిత్యంలో
సమృద్ధిగా వైద్య విశేషాలు

● గుంటూరు వైద్యనిపుణులు ఏవీ దక్షిణామూర్తి

ప్యారీస్, ఏప్రిల్ 28:ప్రాచీన కావ్య సాహిత్యాల్లో ఆధునిక వైద్య విశేషాలు మెండుగా ఉన్నాయని గుంటూరుకు చెందిన ప్రముఖ ఎముకల వైద్యనిపుణులు డాక్టర్ ఏవీ దక్షిణామూర్తి పేర్కొన్నారు. వేదవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 'ప్రాచీన కావ్య సాహిత్యంలో ఆధునిక వైద్యాంశాలు' అనే అంశంపై తరతరాల తెలుగు కవి ఉపన్యాస ధారావాహిక 148వప్రసంగ కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది.టి.నగర్‌లోని ఆస్కా ప్రాంగణంలో ఏర్పాటైన సభలో డాక్టర్ దక్షిణామూర్తి ఆసక్తికరమైన అంశాలను పవర్ ప్రెజెంటేషన్ ద్వారా సభికులకు వివరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలం నుంచి వైద్య శాస్త్రం అభివృద్ధి చెందుతోందని, తాను వృత్తిరీత్యా వైద్యుడే అయినప్పటికీ తెలుగు సాహిత్యమన్నా, బాలవ్యాకరణమన్నా చాలాఇష్టమన్నారు. ప్రాచీన సాహిత్యంలో భారతీయత స్పష్టంగా కనుబడుతుందని,ఇది మానవ జీవితాన్ని సుసంపన్నం, సుఖవంతం, శాంతియుతంగా మలిచేందుకు దోహదపడుతుందన్నారు.సాహిత్యంలో అందమైన వర్ణనలు,భక్తి,నీతులు పలువురి అనుభవాలున్నాయని వివరించారు.ప్రాచీన సాహిత్యంలో వైద్యానికి అద్భుతమైన స్థానం కూడా ఉందన్నారు. ప్రాచీన కవులు తమ కావ్యాల్లో వైద్యం గురించి అనేక ప్రస్తావనలూ చేశారన్నారు. అరుణా శ్రీనాథ్ ప్రార్థనాగీతంతో ప్రారంభమైన కార్యక్రమంలో వక్తను వేద విజ్ఞానవేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ప్రముఖులు ఒంటెల కృష్ణారావు, పురుషోత్తం, రంగారెడ్డి సహా పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

ఢిల్లీకి వెళ్లిన గవర్నర్

పెరంబూర్, ఏప్రిల్ 28: రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆదివారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలోని తమిళనాడు భవనంలో బసచేయనున్న గవర్నర్, కొన్ని ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. గవర్నర్ ఢిల్లీ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమని రాజ్‌భవన్ అధికారులు తెలిపారు. మంగళవారం నగరానికి తిరిగిరానున్న గవర్నర్, బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని సమాచారం.

కీలక సమావేశం రద్దు చేసిన అన్నామలై

● బీజేపీ నేతల దిగ్భ్రాంతి

అడయార్, ఏప్రిల్ 28: రాష్ట్రంలో ముగిసిన లోక్‌సభ ఎన్నికల సమయంలో భారతీయ జనతా పార్టీపై పలు రకాల ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా నగదు బట్వాడా, పోస్టర్ల యుద్ధం, పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు తదితర అంశాలపై చర్చించేందుకు సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సారథ్యంలో కీలక సమావేశం జరుగుతుందని ముందుగా ప్రకటించారు. ఈ సమావేశాన్ని ఆకస్మికంగా రద్దు చేయడం ఇపుడు పార్టీ నేతల్లో చర్చనీయాంశంగా మారింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు ఈ నెల 19వ తేదీన పోలింగ్ జరిగింది. కొన్ని పార్టీలను కలుపుకుని కూటమి పార్టీగా అవతరించిన బీజేపీ 23 సీట్లలో పోటీ చేసింది. అయితే, ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ డబ్బులు పంపిణీ చేయబోదంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై ఊకదంపుడు ప్రచారం చేశారు. కానీ, ఆయన పోటీ చేసిన కోయంబత్తూరులో బీజేపీ నేతలు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తూ పలువురు పట్టుబడ్డారు. ఇది పార్టీ నేతలను విస్మయానికి గురిచేసింది. అలాగే, ఆ పార్టీ సీనియర్ నేత నయినార్ నాగేంద్రన్ సహాయకుడి వద్ద రూ.4 కోట్లు పట్టుకున్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. అలాగే, సినీ నటి రాధికా శరత్ కుమార్ పోటీ చేసిన విరుదునగర్ నియోజకవర్గంలో పార్టీ ఎన్నికల ఖర్చు కోసం ఇచ్చిన రూ.40 లక్షలు పార్టీ నేతలే మింగేశారనే ప్రచారం సాగుతుంది. ఈ అంశంలో ఆ పార్టీ నేతల మధ్య పోస్టర్ల యుద్ధం కొనసాగింది. అలాగే, ఓటర్లకు డబ్బు పంపిణీ, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన కారణంగా బీజేపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో టి.నగర్‌లోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో కె.అన్నామలై సారథ్యంలో ఆ పార్టీ నేతల కీలక సమావేశం సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ, ఈ సమావేశాన్ని ఉన్నపళంగా రద్దు చేయడం పార్టీ నేతల్లో చర్చనీయాంశంగా మారింది.

నాలుగో అంతస్తు నుంచి జారిపడిన చిన్నారి

● సురక్షితంగా రక్షించిన స్థానికులు

పెరంబూర్, ఏప్రిల్ 28: స్థానిక తిరుములైవాయల్ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ నుంచి జారిపడిన చిన్నారిని స్థానికులు ప్రాణాలకు తెగించి రక్షించారు. ఈ అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తులో నివసిస్తున్న వెంకటేష్, రమ్య దంపతులకు ఏడు నెలల శిశువు ఉంది. ఆదివారం మధ్యాహ్నం టెర్రస్‌లో ఆడుకుంటున్న చిన్నారి హఠాత్తుగా గోడ నుంచి జారి కింద పడింది. ఆ సమయంలో ఆ చిన్నారి ఒకటవ అంతస్తులోని రేకుల షెడ్‌పై చిక్కుకొని వేలాడుతూ కనిపించింది. దీనిని గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు కింది భాగంలో పెద్ద గుడ్డ పట్టుకొని చిన్నారి కిందపడితే రక్షించేందుకు సిద్ధంగా ఉన్నారు. అంతలో పక్కింటిలో ఉన్న వ్యక్తి కిటికీ ద్వారా పైకెక్కి అత్యంత ప్రమాదస్థితిలో చిన్నారిని రక్షించారు. అతడికి మరో స్నేహితుడు సాయం చేశాడు. చిన్నారిని సురక్షితంగా రక్షించి సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, చిన్నారి ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు. చిన్నారి 1వ అంతస్తులో వేలాడుతుండడంతో, ఆమెను రక్షించేందుకు స్థానికులు చేసిన ప్రయత్నాలతో కూడిన వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడి వైరల్‌గా మారాయి.



చిన్నారిని రక్షిస్తున్న దృశ్యం

సమాచార దృశ్శని

3న సర్టిఫికెట్ల పరిశీలన

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: సహకార శాఖ జూనియర్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి మే 3వ తేది రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సిలింగ్ జరుగనుంది. ఈ పోస్టుల భర్తీకి 2023 జనవరి 28న టీఎన్‌పీఎస్సీ రాత పరీక్ష నిర్వహించి ఆగస్టు 30వ తేది మార్కులు, ర్యాంకులు ప్రకటించింది. తొలివిడత సర్టిఫికెట్ల పరిశీలన ఈ ఏడాది జనవరి 8వ తేది జరుగ్గా, రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సిలింగ్ 3వ తేది బ్రాడ్‌వే సమీపంలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరుగనుంది.

తమిళ కవుల దినోత్సవంగా పావేందర్ జయంతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: తమిళ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పావేందర్ 133వ జయంతిని తమిళ కవుల దినోత్సవంగా జరుపుకోనున్నారు. సోమవారం ఉదయం మదురై ప్రపంచ తమిళ సంఘ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో తమిళ అభివృద్ధి శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అవ్వై అరుళ్ ప్రారంభ ఉపన్యాసం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మదురై జిల్లా కలెక్టర్ సంగీత ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మంగళూరు సెంట్రల్-బరౌని ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 28: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మంగళూరు సెంట్రల్-బరౌని మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06093 మంగళూరు సెంట్రల్-బరౌని వారాంతపు ప్రత్యేక రైలు మే 5,12,19,26, జూన్ 2,9,16,23,30 తేదీల్లో (ఆదివారం) మంగళూరు సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 2.15 గంటలకు బయల్దేరి (జోలార్‌పేట, కాట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు మార్గంలో) మూడో రోజు రాత్రి 10.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06094 బరౌని-మంగళూరు సెంట్రల్ వారాంతపు ప్రత్యేక రైలు మే 8,15,22,29, జూన్ 5,12,19,26 తేదీల్లో (బుధవారం) బరౌని నుంచి రాత్రి 11.45 గంటలకు బయల్దేరి నాలుగో రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు మంగళూరు సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైనట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

కల్పాక్కం కొత్త యూనిట్‌లో వచ్చే ఏడాదిలో ఉత్పత్తి

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: చెంగల్పట్టు జిల్లా కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రంలోని కొత్త యూనిట్‌లో వచ్చే ఏడాది మార్చిలో ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. 500 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటైన ఈ కేంద్రంలో కోర్ లోడింగ్ పనులు ఇటీవల పూర్తయ్యాయని, వచ్చే ఏడాది మార్చిలో ఉత్పత్తి ప్రారంభించనున్నామని, ఇందులో ఉత్పత్తయ్యే విద్యుత్‌లో 150 మెగావాట్లు రాష్ట్రానికి కేటాయించనున్నామని అధికారులు తెలిపారు.

జూన్ వరకు డిగ్రీ టీచర్లకు వేతనాల విడుదల

పెరంబూర్, ఏప్రిల్ 28: పాఠశాల విద్యాశాఖలో తాత్కాలికంగా పనిచేస్తున్న 1,282 మంది డిగ్రీ టీచర్లకు జూన్ వరకు వేతనం చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అందరికీ విద్య పథకం కింద 2011వ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో 1,282 మంది డిగ్రీ టీచర్లను నియమించారు. వీరికి పదవీకాలం పలువిడతలుగా పొడిగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో, వీరికి జూన్ వరకు వేతనం చెల్లించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి జె.కుమరగురుపరన్ అన్ని జిల్లా ట్రెజరీ కార్యాలయాలకు లేఖ రాశారు.

కీళడి మ్యూజియంలో సంగ కాల పూలు, చెట్ల ప్రదర్శన

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: శివగంగ జిల్లా కీళడి మ్యూజియంలో 2,600 ఏళ్ల నాటి ప్రజలు వినియోగించిన శంఖం గాజులు, బంగారు ఆభరణాలు, సంగ కాలం నాటి పూలు, చెట్లు ప్రదర్శించారు.సంగ కాల సాహిత్య గేయాల్లో పేర్కొన్న 'నల్లిరుల్‌నారి','మయిలై', 'మరుదం', 'ఆరం', 'ఎళిలై', 'పాలై' రకం పూలు, మొక్కలను మూడు నెలలుగా పెంచారు. పాండ్య రాజుల కావలి దైవమైన వేప చెట్టు కూడా ఈ ప్రదర్శనలో ఉంది.

అప్రంటీస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: సీఎండీఏ నిర్వహిస్తున్న అప్రెంటీస్ శిక్షణలో పాల్గొనేందుకు మే 10వ తేది వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వివిధ విభాగాల్లో అప్రెంటీస్ శిక్షణలో చేరే వారికి నెలకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఉపకారవేతనం అందజేయనున్నారు. డిప్లొమో, డిగ్రీ కోర్సులు చేసిన వారు సీఎండీఏ వెబ్‌సైట్‌లో మే 10వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

రూ.1.5 కోట్లతో ఎస్కలేటర్లు

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: స్థానిక ఆవడి రైల్వేస్టేషన్‌లో రూ.1.5 కోట్లతో మూడు ఎస్కలేటర్లు ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆరు ప్లాట్‌ఫారాలు, ఆరు రైల్వే ట్రాక్‌లు కలిగిన ఈ స్టేషన్ మీదుగా ప్రతిరోజు 285 సబర్బన్, 5 ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ప్రతిరోజు 3 లక్షల మందికి పైగా ప్రయాణిస్తున్నారు. 1వ ప్లాట్‌ఫారం నుంచి ఇతర ప్లాట్‌ఫాంలకు వెళ్లేందుకు రైలుపట్టాలు దాటాల్సి వస్తుంది. వృద్ధులు, గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో, నాలుగు ప్లాట్‌ఫారాలను అనుసంధానం చేసేలా రూ.3 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుచేశారు. ప్రస్తుతం రూ.1.5 కోట్ల వ్యయంతో మూడు ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వాణిజ్య పన్ను చెల్లించని దుకాణాలకు సీలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: స్థానిక ఆదంబాక్కంలో వాణిజ్య పన్ను చెల్లించని ఏడు దుకాణాలకు అధికారులు సీలు వేశారు. ఈ మండల పరిధిలోని ప్రాంతాల్లో కొన్నేళ్లుగా పన్ను చెల్లించకుండా, లైసెన్స్ రెన్యువల్ చేసుకోని దుకాణాల యజమానులకు పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీచేశారు. కొంతమంది చెల్లించగా, పన్ను చెల్లించని ఏడు దుకాణాలకు అధికారులు సీలు వేశారు.

13 నుంచి నాగపట్టినం - శ్రీలంక మధ్య మళ్లీ నౌకాయానం

పెరంబూర్, ఏప్రిల్ 28: నాగపట్టణం-శ్రీలంక మధ్య నౌకాయానం మళ్లీ ప్రారంభం కానుంది. 40 ఏళ్ల అనంతరం నాగై-లంక మధ్య ప్రయాణికుల నౌక రవాణా సేవలను ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గత ఏడాది అక్టోబరు 14న ప్రారంభించారు. నాగపట్టణం నుంచి సుమారు 50 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న శ్రీలంకలోని కాంగేశం హార్బర్‌కు 'సెరియపాణి' అనే ఈ నౌక మూడు గంటల్లో చేరుకుంటుంది. ఒక ప్రయాణికుడు 50 కిలోల వరకు వస్తువులు తీసుకెళ్లవచ్చని ప్రకటించారు. ఇటీవల వర్షాల కారణంగా ఈ నౌక సేవలు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, 'శివగంగై' అనే పేరుతో కూడిన ప్రయాణికుల నౌక రవాణా ఈ నెల 13 నుంచి నాగపట్టణం నుంచి శ్రీలంకకు బయల్దేరి వెళుతుందని ప్రకటన వెలువడింది.

నెంబర్ ప్లేట్లపై అనవసర స్టిక్కర్లు

● రూ.1,500 వరకు జరిమానా

పెరంబూర్, ఏప్రిల్ 28: నగరంలో వాహనాల నెంబర్ ప్లేట్లపై నిబంధనలు అతిక్రమించి స్టిక్కర్లు అంటించితే మే 2వ తేది నుంచి రూ.500 నుంచి రూ.1,500 వరకు జరిమానా విధిస్తామని నగర ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు తమ నెంబరు ప్లేట్లపై ఎలాంటి స్టిక్కర్లు అంటించరాదు. ప్రభుత్వ స్టిక్కర్లు, ముద్రలు ప్రైవేటు వాహనాలపై వినియోగించకూడదు. అలాగే, ప్రైవేటు వాహనచోదకులు రాజకీయ నేతల ఫొటోలు, పార్టీ చిహ్నాలు, డాక్టర్, లాయర్ ముద్రలు తదితరాలు నెంబరు ప్లేట్లపై వేస్తున్నారు. అలాంటివి మోటారు వాహన చట్టం ప్రకారం నేరమని, ఇలాంటి స్టిక్కర్లను మే 1వ తేదిలోపు తొలగించాల్సి ఉంది. మే 2 నుంచి ప్రైవేటు వాహనాలపై ఇలాంటి స్టిక్కర్లతో తొలిసారి పట్టుబడితే రూ.500, రెండు, మూడవ సారి పట్టుబడితే రూ.1,500 వరకు జరిమానా విధిస్తామని ట్రాఫిక్ పోలీసు శాఖ హెచ్చరించింది.

పళవేర్కాడులో 11,786 తాబేలు గుడ్ల సేకరణ

పెరంబూర్, ఏప్రిల్ 28: స్థానిక పళవేర్కాడు సముద్రతీరంలో ఈ నెల 15వ తేది వరకు 11,786 తాబేలు గుడ్లు సేకరించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. సముద్రాన్ని శుభ్రం చేయడంలో 'ఆలివ్ రిడ్లీ' తాబేళ్ల ప్రధానమైనవి, నడి సముద్రంలో ఉండే ఈ తాబేళ్లు నవంబరు-మార్చి నెలల్లో తీరానికి చేరుకొని గుడ్లు పెట్టి వెళుతుంటాయి. ఈ గుడ్లు నక్కలు, పక్షులు తీసుకెళ్లకుండా అటవీ శాఖ చర్యలు చేపట్టింది. పళవేర్కాడు ముఖద్వారం నుంచి కాట్టుపల్లి సముద్రతీరం వరకు రాత్రి వేళల్లో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు వచ్చి గుడ్లు పెట్టి వెళుతుంటాయి. ఈ గుడ్లను అటవీ సిబ్బంది సేకరించి ఆరంగం కుప్పం ప్రాంతంలో 120 గుంతలు తీసి భద్రపరిచారు. ఈ గుడ్ల నుంచి 45 రోజుల్లో పిల్లలు వస్తుండగా, వాటిని అటవీ సిబ్బంది సముద్రంలో వదిలిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరు నుంచి ఈ నెల వరకు 9,418 తాబేలు పిల్లలను సముద్రంలో వదలగా, మరో 11,786 గుడ్లు సేకరించినట్లు పళవేర్కాడు అటవీ రేంజర్ జోసఫ్ వెస్లీ తెలిపారు.

చేపల పెంపకానికి రూ.300 కోట్ల రుణాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: చేపల పెంపకానికి రూ.300 కోట్ల రుణాలు అందజేయాలని సహకార సంఘాలకు ఆ సంఘాల రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. సహకార శాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘాల్లో పంట రుణాలు, నగల రుణాలు సహా వివిధ విభాగాల్లో రుణాలు అందజేస్తున్నారు. అలాగే, మేకలు, గొర్రెలు, కోళ్లు, పశువులు, చేపల పెంపకాలకు రైతులకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం పశువులు, చేపల పెంపకం వంటి వృత్తులకు రూ.2,500 కోట్ల రుణాలు అందజేయనుండగా, అందులో చేపల పెంపకానికి మాత్రమే రూ.300 కోట్లు అందజేయాలని సహకార సంఘాల రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు.

అయోధ్య మండపంలో 'సహస్ర చండీ' మహాయజ్ఞం

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: జగద్గురు వేద పారాయణ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర జయంతిని పురస్కరించుకొని సహస్ర చండీ మహాయజ్ఞం జరుగనుంది. మే 2వ తేది ఉదయం 7.30 గంటలకు గురు వందనంతో ప్రారంభించి విఘ్నేశ్వర పూజ, గణపతి హోమం, నవగ్రహ హోమాలు జరుగనున్నాయి. సాయంత్రం చంద్రశేఖర సరస్వతి స్వామి తీర్థనం నిర్వహించనున్నారు. మే 3 నుంచి 13వ తేది వరకు చండీ పారాయణం, చండీ హోమం, పూర్ణాహుతి, 4వ తేది రాత్రి 7 గంటలకు కూడలి శృంగేరి మఠం పీఠాధిపతి అభినవ శంకర భారతి మహాస్వామికి స్వాగతం, ఆశీస్సుల కార్యక్రమం జరుగనుంది. మే 12వ తేది భవమాన హోమం, ఆవాహంతి హోమం, 13న మహాలక్ష్మి హోమం జరుగనున్నాయి. మే 3 నుంచి ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు నాటకాలు, ఉపన్యాస కార్యక్రమాలు జరుగనున్నాయి. 7 నుంచి 11వ తేది వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7 గంటల వరకు చతుర్వేద పారాయణం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఆది శంకర విగ్రహానికి అభిషేకం, దీపారాధనలు జరుగనున్నాయి. ఆదిశంకరుల 2500 ఆరాధనోత్సవం కంచి శంకర మఠంలో మే 19న జరుగనుంది.

కరుప్పన్నసామి వేడుకల్లో 235 మేకలతో విందు

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: శివగంగ సమీపంలో కాలువ తూమును కరుప్పన్నస్వామిగా ఆరాధిస్తున్నారు. అక్కడి జరిగే ఉత్సవాల్లో పురుషులు మాత్రమే పాల్గొంటున్నారు. 235 మేకలు బలిచ్చి వాటి మాంసంతో భారీ విందు ఏర్పాటుచేశారు. తిరుమలై గ్రామంలో రైతులకు నీటి ఆధారంగా ఉన్న కాలువ తూమును కరుప్పన్న స్వామిగా పూజలు చేస్తుంటారు. ప్రతి ఏటా పురుషులు మాత్రమే పాల్గొని పొట్టేళ్లు, మేకపోతులను వధించి విందు తయారు చేసి ప్రసాదంగా పంపిణీ చేస్తుంటారు. ఈ కార్యక్రమంలో సుమారు 7,000 మందికి పైగా పురుషులు పాల్గొన్నారు.

కొడైకెనాల్‌లో ఆరు రోజులు డ్రోన్లకు నిషేధం

పెరంబూర్, ఏప్రిల్ 28: ముఖ్యమంత్రి స్టాలిన్ కొడైకెనాల్‌లో బసచేయనుండటంతో ఆయన భద్రతా చర్యల్లో భాగంగా ఆరు రోజులు ఆ ప్రాంతంలో డ్రోన్లు ఎగిరేందుకు నిషేధం విధించారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ఈ నెల 19న ఒకేవిడతలో జరుగ్గా, ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనుంది. ఎండలు మండుతున్నా ఎన్నికల ప్రచారంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహా అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో, సీఎం స్టాలిన్ విశ్రాంతి కోసం కుటుంబ సమేతంగా కొడైకెనాల్ వెళ్లనున్నారు. ఆ ప్రకారం, సోమవారం నుంచి మే 6 వరకు సీఎం కొడైకెనాల్‌లో బస చేయనున్నారు. సీఎం భద్రతా చర్యల్లో భాగంగా కొడైకెనాల్ ప్రాంతాల్లో డ్రోన్లు, బెలూన్ల ఎగురవేతకు నిషేధం విధిస్తున్నట్లు దిండుగల్ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు.

రూ.4 కోట్ల స్వాధీనం కేసుపై సీబీసీఐడీ విచారణ

ప్యారీస్, ఏప్రిల్ 28: తాంబరం రైల్వేస్టేషన్‌లో ఈనెల 6వ తేది రూ.4 కోట్ల నగదు పట్టుబడిన కేసు వ్యవహారంలో సీబీసీఐడీ విచారణ ప్రారంభించింది. తిరునల్వేలి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ నిర్వహిస్తున్న హోటల్ సిబ్బంది సతీష్ సహా ముగ్గురు తిరునల్వేలి వెళ్లేందుకు తాంబరం రైల్వేస్టేషన్ చేరుకున్న సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వారి బ్యాగులు తనిఖీ చేసి రూ.4 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న ఈ నగదుకు సంబంధించి వివరణ కోరుతూ నయినార్ నాగేంద్రన్ సహా పలువురికి సమన్లు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో, ఈ కేసు విచారణ సీబీసీఐడీకి బదిలీ చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. శనివారం కేసుకు సంబంధించిన దస్తావేజులను సీబీసీఐడీ అధికారులకు తాంబరం పోలీసులు అప్పగించడంతో విచారణ మొదలైంది.



వేలూరు తంతై పెరియార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను ఆదివారం పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి

ఆలయ మిరాశీదారుడిగా బాలుడి ఎంపిక

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: ఆలయ మిరాశీదారుడిగా ఓ బాలుడు ఎంపికయ్యాడు. తేని జిల్లా కంభంలో ఒక్కలిక గౌండర్ కులస్థులకు చెందిన విగ్రహాలు లేని నందగోపాలన్ ఆలయం ఉంది. ఆ ఆలయంలో కోడియప్పనార్, పూసారియప్పనార్, పెరియ మనైకారర్, పట్టత్తుకారర్ అనే నాలుగు పదవుల్లో ఉన్న వారు దేవుని దూతలుగా, కావలి దైవాలుగా భావిస్తారు. ఈ నలుగురు ఆలయ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తుంటారు. గ్రామంలో జరిగే ఎలాంటి అశుభ కార్యక్రమానికి వీరు హాజరుకారు. ఈ నలుగురిలో పట్టత్తుకారర్ ఇటీవల మృతిచెందారు. దీంతో కొత్త పట్టత్తుకారర్‌ను ఎంపిక కార్యక్రమం శనివారం జరిగింది. ఆ గ్రామానికి చెందిన ఆనంద్ కుమార్ కుమారుడు ఆదవన్ (7) పట్టత్తుకారర్ (మిరాశీదారు) పదవికి ఎంపికయ్యాడు.

వాల్పారైలో కార్చిచ్చు

ఐసిఎఫ్, ఏప్రిల్ 28: కోయంబత్తూర్ జిల్లా వాల్పారై సమీపంలో ఏర్పడిన కార్చిచ్చుతో 50 ఎకరాల విస్తీర్ణంలో చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రాంతంలో అప్పుడప్పుడు కార్చిచ్చు ఏర్పడుతోంది. శనివారం వాటర్ ఫాల్ ఎస్టేట్‌లో ఉన్న అటవీ ప్రాంతంలో ఏర్పడిన మంటలు 50 ఎకరాల మేరకు విస్తరించాయి. సత్యమంగళం, తాళవాడి ప్రాంతాల నుంచి వచ్చిన అగ్నిమాపక వాహనాలతో అటవీ, అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు చర్యలు చేపట్టారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

పెరంబూర్, ఏప్రిల్ 28: స్థానిక నెమ్మెలే నిర్లవనీకరణ కేంద్రంలో మరమ్మతుల కారణంగా అడయార్, పెరుంగుడి, షోలింగనల్లూర్ మండలాల్లో ఈ నెల 30వ తేది సాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని 13వ మండలం అడయార్ పరిధిలోని తిరువాన్మియూర్, పళ్లిపట్టు, కొట్టూరు గార్డెన్, ఆర్కే మఠం, ఇందిరా నగర్, 14వ మండలం పెరుంగుడి పరిధిలోని కొట్టివాక్కం, పాలవాక్కం, పెరుంగుడి, పళ్లికరనై మడిపాక్కం, పుళివాక్కం, 15వ మండలం షోలింగనల్లూర్ పరిధిలోని ఈంజంబాక్కం, నీలాంగరై, అక్కరై, ఎళిల్‌నగర్, కన్నగినగర్, కారపాక్కం, వెట్టువాన్‌కేని, షోలింగనల్లూర్, సెమ్మంజేరి, ఒక్కియం-దురైపాక్కం ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మే 1వ తేది ఉదయం 9 గంటల వరకు (ఒక రోజు) తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మెట్రోవాటర్ బోర్డు తెలియజేసింది.

45 కోట్ల యూనిట్లకు చేరిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, ఏప్రిల్ 28: రాష్ట్ర విద్యుత్ వినియోగం 45 కోట్ల యూనిట్లకు చేరుకుంది. రాష్ట్రంలో సాధారణ విద్యుత్ వినియోగం 30 కోట్ల యూనిట్ల వరకు నమోదవుతోంది. ఈ ఏడాది మార్చి నుంచే ఎండ తీవ్రత అధికం కావడంతో విద్యుత్ వినియోగం కూడా రోజురోజుకు పెరుగుతోంది. ఈ నెల 18వ తేది రాష్ట్ర విద్యుత్ వినియోగం 44.82 కోట్ల యూనిట్లకు చేరుకోగా, 26వ తేది రాష్ట్ర చరిత్రలో లేని విధంగా విద్యుత్ వినియోగం 45.17 కోట్ల యూనిట్లుగా నమోదైందని అధికారులు తెలిపారు.

రూ.4.88 లక్షల మోసం.. ఒకరి అరెస్టు

పెరంబూర్, ఏప్రిల్ 28: మతం మారితే రూ.10 కోట్ల ఇస్తామని ఆశచూపి రూ.4.88 లక్షల మోసానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టికి చెందిన ఓ యువకుడికి 'ఐఎంఓ' అనే యాప్ ద్వారా చొక్కనాథన్ అనే ఖాతా నుంచి సంప్రదించిన ఓ వ్యక్తి, హిందూ మతం నుంచి క్రైస్తవ మతంలోకి మారితే రూ.10 కోట్లు ఇస్తామని తెలిపాడు. అందుకోసం అమెరికాలో బ్యాంక్ ఖాతా ప్రారంభించేందుకు వాణిజ్య పన్ను సహా పలు కారణాలకు నగదు కావాలని తెలిపాడు. ఈ మాటలు నమ్మిన ఆ యువకుడు, రూ.4,88,159 లక్షలను జీపే ద్వారా పంపించాడు. కొద్దిరోజుల తర్వాత తాను మోసపోయానని తెలుసుకున్న యువకుడు, 'ఎన్‌సీఆర్పీ'లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టి, ఈ మోసానికి పాల్పడిన తంజావూరు ఆనందం నగర్‌కు చెందిన రాజవేల్ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు అస్సాం యువకుల అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 28: నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు చేపట్టిన ఘటనల్లో, 25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని అస్సాం రాష్ట్రానికి చెందిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులతో పోలీసులు నగరంలో 'డ్రైవ్ అగైనెస్ట్ డ్రగ్స్' పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ట్రిప్లికేన్ ఎక్సైజ్ బృందం ఎగ్మూర్ రైల్వేస్టేషన్ సమీపంలో గస్తీ తిరుగుతుండగా అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొని అతడి బ్యాగులో 12.3 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకొని, అస్సాం రాష్ట్రం ట్రిలోచాన్‌పూర్‌కు చెందిన బాధురామ్ సింగ్ (22)అదుపులోకి తీసుకున్నారు. అలాగే, ఎగ్మూర్ రైల్వేస్టేషన్ పార్శిల్ కార్యాలయంలో అస్సాం రాష్ట్రానికి చెందిన సుమంతాసింగ్ (23)ను అరెస్ట్ చేసి, 13.1 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

కూరగాయల మార్కెట్లో అగ్నిప్రమాదం



చెలరేగిన మంటలు

వేలూరు, ఏప్రిల్ 28: గుడియాత్తం ధర్నాంపేటలో కూరగాయల మార్కెట్ లో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాలిలా.. ఈ మార్కెట్ సమీపంలో గుడిసె వేసుకొని పుచ్చకాయల విక్రయ దుకాణం నడుపుతున్నారు. మార్కెట్‌లో సేకరించే చెత గుడిసె వెనుక వైపున్న ఖాళీ స్థలంలో తగులబెడుతుంటారు. ఆ ప్రకారం, శనివారం రాత్రి 9 గంటలకు వ్యర్థాలకు నిప్పంటించారు. ఆ సమయంలో వచ్చిన గాలికి నిప్పురవ్వలు గుడిసెపై పడడంతో మంటలు చెలరేగాయి. ఈ మంటలు మార్కెట్‌లోని దుకాణాలు, సెల్‌ఫోన్ దుకాణానికి వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ రద్దీతో ప్రజల ఇక్కట్లు



కాట్పాడిలో ట్రాఫిక్ రద్దీలో వాహనాలు

వేలూరు, ఏప్రిల్ 28: స్థానిక కాట్పాడిలో ప్రతిరోజు సాయంత్రం 2 గంటలు ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుండడంతో వాహనచోదకులు, ప్రజ లు ఇబ్బందులు పడుతున్నా రు. కాట్పాడి ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రతి ఇంట్లో కార్లు, ద్విచక్రవాహనాలు అధిక సంఖ్యలో వినియోగిస్తున్నారు. అలాగే, కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల సంఖ్యకూడా పెరిగింది. వాహనాల రద్దీతో కాట్పాడి రైల్వే వంతెన సమీపంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా వేడుక చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సామాజిక సేవకుడు మునుస్వామి మాట్లాడుతూ... కాట్పాడి ప్రాంతంలో సాయంత్రం 5 గంటల నుంచి ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటోంది. ట్రాఫిక్ పోలీసులు వచ్చి ఏదో కొంత మాత్రమే సరిచేస్తున్నారు. పూర్తిగా సరిచేయడం లేదు. ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా ఒక రైల్వే వంతెన, తిరుపతి మార్గంగా వెళ్లేందుకు మరో వంతెన నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని, అలాగే, ట్రాఫిక్ పోలీసులు కూడా సాయంత్రం వేళల్లో సక్రమంగా విధులు నిర్వహించాలని మునుస్వామి కోరారు.

రాష్ట్రంలో 83 శాతం తక్కువగా వేసవి వర్షాలు

పెరంబూర్, ఏప్రిల్ 28: రాష్ట్రంలో వేసవి వర్షాలు సాధారణం కన్నా 83 శాతం తక్కువగా కురిశాయని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల ప్రారంభం నుంచే పలు జిల్లాల్లో ఎండ తీవ్రత అధికమైంది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో వేసవి వర్షాలు కురుస్తుంటాయి. ఆ ప్రకారం, గత మార్చి నుంచి ఈ నెల 27వ తేది వరకు నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. తిరునల్వేలిలో 69.7 మి.మీ, కన్నియాకుమారిలో 55.5, విరుదునగర్‌లో 31.7, నీలగిరిలో 30.7, తెన్‌కాశిలో 30, తేనిలో 22, తక్కువగా అరియలూరులో 1.9 మి.మీ వర్షం కురిసింది. చెన్నై సహా పలు జిల్లాల్లో 1 మి.మీ వర్షం కూడా కురవలేదు. రాష్ట్రంలో వేసవి వర్షం సాధారణంగా 53.3 మి.మీ కురవాల్సి ఉండగా, ప్రస్తుత ఏడాది 9.4 మి.మీ మేరకు మాత్రమే వర్షపాతం నమోదైంది. ఆ ప్రకారం, సాధరణం కన్నా 83 శాతం తక్కువగా వేసవి వర్షాలు కురిశాయని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది.

నేడు ప్రొఫెసర్ నిర్మలాదేవి కేసు తీర్పు

ప్యారీస్, ఏప్రిల్ 28: విద్యార్థినులను తప్పుడు మార్గంలోకి నెట్టిన వ్యవహారంలో అరుప్పుకోటకు చెందిన ప్రొఫెసర్ నిర్మలాదేవి కేసు తీర్పు సోమవారం వెలువడనుంది. అరుప్పుకోటలోని దేవాంగర్ కళాశాలలో గణిత విభాగం ప్రొఫెసర్ నిర్మలాదేవి విద్యార్థినులను తప్పుడు మార్గంలోకి నెట్టేందుకు యత్నించారనే ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఆమెకు సహకరించిన మదురై కామరాజర్ వర్సిటీ ప్రొఫెసర్ మురుగన్, పరిశోధన విద్యార్థి కరుప్పుస్వామిలను కూడా అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకు తరలించారు. 2018లో జరిగిన ఈ కేసు విచారణను సీబీసీఐడీ చేపట్టగా, అదే సమయంలో శ్రీ విల్లిపుత్తూర్ మహిళా కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుతో సంబంధాలున్న సాక్షుల విచారణ ముగిసిన నేపథ్యంలో, శుక్రవారం తీర్పు చెప్పనున్నట్లు ప్రకటన వచ్చింది. నిర్మలాదేవి మినహా మిగతా ఇద్దరు కోర్టులో విచారణకు హాజరయ్యారు. అందువల్ల సోమవారం తీర్పు చెప్పనున్నట్లు న్యాయమూర్తి భగవతి అమ్మాళ్ ప్రకటించారు.

విదేశీ విద్యార్థులకు అదనంగా 25 శాతం సీట్లు

● యూజీసీ ఉత్తర్వు

ప్యారీస్, ఏప్రిల్ 28: విదేశీ విద్యార్థులకు అదనంగా 25 శాతం సీట్లు కేటాయించాలంటూ రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ప్రైవేటు కళాశాలల యజమాన్యానికి యూజీసీ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు యూజీసీ కార్యదర్శి మనీష్ జోషి విశ్వవిద్యాలయాలకు, వైస్ చాన్సలర్లకు లేఖ రాశారు. 2024-25వ విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు యూజీసీ నిబంధనల మేరకు చేపట్టాలని, ఉన్నత విద్యాసంస్థల్లో పీహెచ్‌డీలో చేరనున్న విదేశీ విద్యార్థులకు అదనంగా 25 శాతం సీట్లు కేటాయించాలని, ఈ వివరాలతో నివేదిక సమర్పించాల్సిందిగా మనీష్ జోషి ఆదేశించారు.

సిగ్నల్‌లో సాంకేతిక సమస్య

● మార్గమధ్యంలో రైళ్ళు నిలిపివేత

అడయార్, ఏప్రిల్ 28: తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి సమీపంలో సిగ్నల్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా పలు రైళ్ళను మార్గమధ్యంలో నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం సాయంత్రం చెన్నై సెంట్రల్ నుంచి మంగుళూరు ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. అయితే, వాణియంబాడి సమీపంలో సిగ్నల్‌లో సాంకేతిక సమస్య ఏర్పడినట్టు సిబ్బంది గుర్తించారు. దీంతో ఆ మార్గంలో నడిచే రైళ్ళ రాకపోకలకు అంతరాయం కలిగింది. ముఖ్యంగా మంగుళూరు ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఆ సమయంలో అటుగా వచ్చే రైళ్ళను మధ్యలో నిలిపివేశారు. ఈ సాంకేతిక సమస్య కారణంగా మంగుళూరు ఎక్స్‌ప్రెస్ తర్వాత రావాల్సిన రైళ్ళు గంట ఆలస్యంగా నడిచాయి.

ప్రజలకు మజ్జిగ పంపిణీ



ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, ఏప్రిల్ 28: స్థానిక రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శరవణన్ ప్రజలకు మజ్జిగ పంపి ణీ చేశారు. జిల్లాలో కొద్దిరోజు లు గా ఎండలు మండుతుండడంతో ప్రజ లు ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అత్యవసర పనుల నిమిత్తం వెళ్లేవారు గొడుగులు, టోపీలు ధరించి వెళుతున్నారు. ఈ నేపథ్యంలో సత్తువాచేరి గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం ఏర్పాటుచేసిన చలివేంద్రం ద్వారా 500 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు దినేష్ శరవణన్ తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

వేలూరు, ఏప్రిల్ 28: స్థానిక సత్తువాచేరి సీఎంసీ కాలనీ ప్రైమరీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. సెన్‌డ్యూసన్ ట్రస్ట్, క్రిస్టియన్ వైద్యకళాశాల ఆస్పత్రి, సత్తువాచేరి సీఎస్ఐ సెయింట్ పాల్ చర్చి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఫాదర్ సురేష్ ఆనంద్‌కుమార్, జాయ్ మోహన్ ప్రారంభించారు. శిబిరంలో సుమారు 200 మంది రక్తదానం చేయగా,ట్రస్ట్ కోశాధికారి జయకరన్,సెక్రటరీ హెన్రీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎంఏ తెలుగు ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అడయార్, ఏప్రిల్ 28: మద్రాసు విశ్వవిద్యాలయం, మెరీనా ప్రాంగణంలోని తెలుగు శాఖలో ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పూర్తి చేసి, దాని కాపీ ప్రింట్ తీసుకుని, తెలుగు శాఖలో గాని, ఆ శాఖాధిపతి డాక్టర్ విస్తాలి శంకర్ రావు, ప్రొఫెసర్ అండ్ హెడ్, తెలుగు శాఖ, మద్రాస్ విశ్వవిద్యాలయం, చెన్నై-600005 అనే చిరునామాకు గాని పంపించాల్సి ఉంటుంది. ఈ ఆన్‌లైన్ అప్లికేషన్లు ఈ నెల 15 నుంచి జూన్ 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం "https://exam.unom.ac.in/cbCS2425/AdmissionPGMPHIL/FrmInsruct' లేదా "https://exam.unom. ac.in/ cb CS2425/index' అనే లింకుల్లో క్లిక్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం అవసరమైన వారు డాక్టర్ పాండురంగం కాళియప్ప (మొబైల్ 97018 69674), ఆచార్య విస్తాలి శంకర్ రావు (మొబైల్ 64452 03041) లేదా డాక్టర్ మాదా శంకరబాబు (మొబైల్ 7200685477) లను ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

9వ తరగతి విద్యార్థి అవయవదానం



వినోద్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, ఏప్రిల్ 28: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన 9వ తరగతి విద్యార్థి అవయవాలను తల్లిదండ్రులు దానం చేశారు. కళ్లకుర్చి జిల్లా కొంగరయ్యపాళయం పాత కాలనీకి చెందిన పెరియస్వామి-పరిమళ దంపతుల మూడో కుమారుడు వినోద్ (14) అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వినోద్ ఈ నెల 24వ తేది కొంగరయ్యపాళయం బస్టాండ్ సమీపంలో నిల్చుని ఉండగా, వేగంగా వచ్చిన బైక్ ఢీకొనడంతో, అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని వెంటనే కళ్లకుర్చి ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం సేలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక శనివారం సాయంత్రం వినోద్ మృతిచెందాడు. దీంతో, వినోద్ అవయవాలు దానం చేయాలని నిర్ణయించిన తల్లిదండ్రులు తమిళనాడు అవయవ మార్పిడి కమిషన్‌కు సమాచారమిచ్చారు. కమిషన్ ఉత్తర్వులతో చెన్నై, కోవై, మదురైకి చెందిన వైద్యుల బృందం సేలం చేరుకొని, మృతిచెందిన వినోద్ గుండె, కాలేయం, మూత్రపిండాలు, కళ్లు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. కాగా, అవయవదాతలను ప్రభుత్వం సన్మానిస్తుందని ప్రకటించారు. కాగా సేలం ప్రభుత్వాసుపత్రిలో వినోద్ మృతదేహానికి ఆస్పత్రి డీన్, వైద్యులు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు.

అవయవదానానికి కానిస్టేబుల్ దంపతుల అంగీకారం

● ఆస్పత్రిలో పేర్ల నమోదు

అడయార్, ఏప్రిల్ 28: తిరుపూరు జిల్లా తిరుమురుగన్‌పూండి సమీపంలోని అమ్మాపాళెయం తిరుపూరు కుమరన్ చేనేత కార్మిక కాలనీకి చెందిన ప్రభు (37) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య మైథిలి (37), విమల్ (8), ఆధీరా (4) అనే పిల్లలు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ కానిస్టేబుల్ దంపతులు తమ మరణాంతరం అవయవాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆ ప్రకారంగా వారు తిరుపూరు ప్రభుత్వ వైద్య కాలేజీలో అవయవదానానికి పేర్లు నమోదు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పలువురు కానిస్టేబుల్ దంపతులను అభినందిస్తున్నారు.

తిరుచెందూరు ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ


తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయం వద్ద రద్దీ

● దర్శనానికి 4 గంటలు

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరుదివ్య క్షేత్రాల్లో ద్వితీయ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన తిరుచెందూరు ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీ అధికం కావటంతో స్వామి వారిని దర్శించడానికి నాలుగు గంటలపాటు క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్షేత్రం గురుక్షేత్రంగా, పరిహార క్షేత్రంగా ఉండటం వల్ల రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వారాంతపు సెలవు దినాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు కూడా సెలవు కావటంతో భక్తులు కుటుంబ సమేతంగా ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి భక్తులు ఈ క్షేత్రానికి తరలివచ్చారు. దీంతో తిరుచెందూరు నగరంలోని వసతి గృహాలన్నింటిని భక్తులు బుక్ చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఆదివారం వేకువజామునే ఆలయం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఆలయానికి చేరువగా ఉన్న సముద్రతీరంలో స్నానమాచరించి స్వామి దర్శనానికి క్యూలైన్లలో నిలిచారు. సుమారు నాలుగుగంటల తర్వాతే భక్తులకు సెంథిల్ ఆండవర్ దర్శనం లభించింది. ఇక వివిధ వాహనాల్లో వచ్చిన భక్తులకు పార్కింగ్ సమస్య ఎదురైంది. దీంతో కార్లు, బైకులతో తిరుచెందూరు నగరం నిండిపోయింది. ఇక ఆలయానికి వస్తున్న వాహన చోదకులను క్రమబద్ధం చేయడానికి పోలీసుల చాలా శ్రమపడాల్సి వచ్చింది.


సముద్ర స్నానం చేస్తున్న భక్తులు



10 నుంచి ఊటీలో 126వ పుష్ప ప్రదర్శన

పెరంబూర్, ఏప్రిల్ 28: నీలగిరి జిల్లా ఊటీలో 126వ పుష్ప ప్రదర్శన మే 10న ప్రారంభమై 20వ తేది వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వేసవి విడిది కేంద్రం ఊటీ నిత్యం పర్యాటకులతో కిటకిటలాడుతోంది. ముఖ్యంగా, వేసవిలో సేదతీరేందుకు ఈ ప్రాంతానికి దేశ, విదేశాల నుంచి పర్యాటకులు కుటుంబాలతో వస్తుంటారు. వేసవి కాలంలో వచ్చే పర్యాటకులకు మరింత ఆహ్లాదం కలిగేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖలు పుష్ప, పండ్ల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది 126వ పుష్ప ప్రదర్శన మే 17 నుంచి 22వ తేది వరకు జరుగుతుందని ఇదివరకే ప్రకటించారు. కానీ, తాజాగా, ఈ ప్రదర్శన 17వ తేదీకి బదులుగా 10వ తేది ప్రారంభమవుతోందని, సాధారణంగా నిర్వహించే ఐదు రోజులకు బదులుగా ఈ ఏడాది 10 రోజులు పుష్ప ప్రదర్శన జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

సంఘసేవకుడికి గౌరవ డాక్టరేట్

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘసేవకుడు, హైదరాబాద్‌కు చెందిన వాణిజ్యవేత్త మల్లారం కార్తీక్ అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ గౌరవ డాక్టరేట్ స్వీకరించారు. వడపళని స్టార్ హోటల్‌లో ఏర్పాటైన ఆ అకాడమీ స్నాతకోత్సవంలో సాల్వేషన్ ఆర్మీ ద్వారా కార్తీక్ నిర్వహించిన సేవలను గుర్తించి ఈ డాక్టరేట్‌తో ఆయనను సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా స్పోర్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంఆర్ సౌందరరాజన్, తమిళనాడు టీవీ జర్నలిస్ట్ ఎస్ఆర్ చంద్రశేఖరన్, టీఎం బైట్ బెక్రిటా ఏన్స్ అండ్ కల్చరల్ సెల్‌కు చెందిన డాక్టర్ వీకే వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.


గౌరవ డాక్టరేట్ స్వీకరిస్తున్న మల్లారం కార్తీక్

9న విజయకాంత్ 'పద్మభూషణ్' అందుకుంటా

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

పెరంబూర్, ఏప్రిల్ 28: దివంగత డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్‌కు ఈ నెల 9న పద్మభూషణ్ పురస్కారం అందజేయనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత తెలిపారు. కోయంబేడులోని పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రేమలత ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... వేసవి ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేలా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఎండ తీవ్రత కారణంగా పాఠశాలల ప్రారంభం వాయిదావేయాలని కోరారు. విరుదునగర్ నియోజకవర్గంలో పోటీచేసిన విజయ ప్రభాకరన్ నెలరోజులుగా నియోజకవర్గంలోనే ఉంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారన్నారు. నీలగిరి స్ట్రాంగ్ రూమ్‌లో 4 గంటలు సీసీ టీవీ కెమెరాలు పనిచేయకపోవడం ఖండిస్తున్నామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద తగిన భద్రత, పర్యవేక్షణ చేపట్టేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విజయకాంత్‌కు ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారం స్వీకరించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి లేఖ వచ్చిందని ప్రేమలత తెలిపారు.


కోయంబేడులోని డీఎండీకే కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రేమలత

అతిపెద్ద ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ షోరూమ్ డయాహార్ట్

అడయార్, ఏప్రిల్ 28: నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన అతిపెద్ద ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ షోరూమ్ 'డయాహార్ట్'ను ప్రముఖ నటి, గాయని ఆండ్రియా జెర్మయ్య ప్రారంభించారు. టి.నగర్‌లో నెలకొల్పిన ఈ షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సహ వ్యవస్థాపకులు చమన్ గొలెచా, చాయా బైద్, కుష్ గొలెచా, రోహిత్ పటేల్ పాల్గొన్నారు. నగర వాసుల కోసం అద్భుతమైన ఆభరణాల కోసం ఈ రిటైలర్ డయాహార్ట్ తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. డైమండ్స్ నాణ్యత, ఆవిష్కరణ, నైతిక సోర్సింగ్‌కు నిబద్ధతతో డయాహార్ట్ ఆభరణాల పరిశ్రమలో శ్రేష్ఠతకు ఒక ఐకాన్‌గా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. డయాహార్ట్ జీఐఏ ధృవీకరణతో అత్యున్నత ప్రమాణాలను కలిగివుందని, ప్రతి కొనుగోలుకు ప్రామాణికత, విలువ నిర్ధారిస్తుందని వారు పేర్కొన్నారు.



డయాహార్ట్ ప్రారంభోత్సవంలో యజమానులతో నటి ఆండ్రియా


పల్లకీలో అళగర్ ఆలయ ప్రవేశద్వారం చేరిన కళ్ళలగర్ స్వామిని దర్శించేందుకు గుమికూడిన భక్తులు.

అళగర్‌మలైలో కళ్ళలగర్

పునరాగమ వైభవం

దివ్య దర్శనంతో పులకించిన భక్తజనం

చెన్నై, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చిత్తిరై ఉత్సవాల్లో మదురై నగరవాసులందరికీ దివ్యదర్శనం ఇచ్చేందుకు బయలుదేరి వెళ్ళిన కళ్ళలగర్ స్వామివారు వారం రోజుల తర్వాత ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్వక్షేత్రమైన అళగర్‌మలై ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ఈ పునరాగమ వైభవంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. వారం రోజుల విరామం తర్వాత ఆ అందాలస్వామిని వీక్షించి భక్తులంతా పులకించిపోయారు. కళ్ళలగర్ స్వామి వారి స్వక్షేత్ర ఆగమనంతో మదురైలో చిత్తిరై ఉత్సవాలు ముగిశాయి. చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న స్వర్ణ అశ్వవాహనంలో మదురై నగరానికి బయలుదేరి వెళ్ళిన కళ్ళలగర్‌స్వామి వారికి దారి పొడవునా భక్తులు ఘనస్వాగతం పలికారు. గత మంగళవారం వేకువజాము వైగై నదిలో శ్రీవిల్లిపుత్తూరు నుంచి వచ్చిన శూడికొడుత్త పూలమాలలను, పచ్చటి పట్టువస్త్రాన్ని ధరించి స్వర్ణ అశ్వవాహనారూఢులై కళ్ళలగర్‌స్వామివారు వేంచేశారు. ఆ రోజు రాత్రి వండియూరు వీరరాఘవ పెరుమాళ్ ఆలయంలో తిరుమంజనాది కార్యక్రమాలు ముగించుకుని అళగర్‌మలైకి పయనమయ్యారు. మార్గమధ్యంలో పలు ఆలయాలు, మండపాల్లో స్వామివారు కొలువుదీరి భక్తులచేత పూజలందుకున్నారు. ఆ తర్వాత శనివారం రాత్రి తల్లాకుళంలో బసచేసిన స్వామివారు ఆదివారం వేకువజాము మూడు గంటలకు పసూల పల్లకీలో అళగర్‌మలె బయలుదేరారు. అప్పన్‌తిరుప్పతి, కళ్ళత్రి మీదుగా ఉదయం 10.30 గంటలకు అళగర్‌మలై ఆలయానికి కళ్ళలగర్ చేరుకున్నారు. అప్పటికే కళ్ళలగర్ స్వామి వారి పునరాగమ వైభవాన్ని తిలకించేందుకు వేల సంఖ్యలో అళగర్‌మలై ఆలయవద్ద గుమికూడారు. అందమైన పూలపల్లకీలో ఆలయ మార్గంలో వస్తున్న స్వామివారిని దర్శించి భక్తులంతా తన్మయం చెందారు. ఆలయ ప్రాకారం వద్ద కూడా భక్తులు అళగర్‌స్వామిని దర్శించుకునేందుకు ప్రయత్నించారు. ఆ సందర్భంగా భక్తుల నడుమ తొక్కిసలాట కూడా జరిగింది. తర్వాత స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు, వైష్ణవ పండితుల మంత్రోచ్ఛారణ నడుమ దీపారాధన, కర్పూర నీరాజనాలు సమర్పించారు. చివరగా కళ్ళలగర్‌స్వామి అంతరాలయంలో ప్రవేశించడంతో మదురై నగర చిత్తిరై ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

ఉద్యోగ నియామకాల్లో సత్యభామ విద్యార్థుల ప్రతిభ

ప్యారీస్, ఏప్రిల్ 28: స్థానిక షోలింగనల్లూర్ సమీపంలోని సత్యభామ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు ఉద్యోగ నియామకాల్లో అరుదైన రికార్డు నెలకొల్పారు. 2023-24వ విద్యా సంవత్సరానికిగాను ఏకంగా 93.09 శాతం మంది ప్రముఖ దేశ, విదేశీ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందారు. ఇందులో ఏడాదికి రూ.45.59 లక్షల గరిష్ట జీతంతో ఉద్యోగం సాధించడం సత్యభామ ఇన్‌స్టిట్యూట్ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోయింది. వీరితో పాటు మరో 5 మంది అంధ విద్యార్థులు ఐఏఎం కళాశాలలో ఉన్నత విద్యకు ఎంపికయ్యారు. సత్యభామ అచీవర్స్ డే ను పురస్కరించుకొని బెస్ట్ ప్లేస్‌మెంట్ క్యాంపస్‌లో ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందించే కార్యక్రమం శనివారం సాయంత్రం సంస్థ ప్రాంగణంలో జరిగింది. ఛాన్సలర్ డా.మరియజీనా జాన్సన్, ప్రెసిడెంట్ డా.మరియాజాన్సన్, వైస్ ప్రెసిడెంట్ అరుళ్‌సెల్వన్, బెన్నతేత్ తమిళరసి, మరియక్సాథలిన్, జయప్రియల సారధ్యంలో జరిగిన ఈ వేడుకల్లో 2,454 మందికి ఉద్యోగ ఉత్తర్వులు అందజేసి అభినందించారు.


ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు



డిష్ టీవీ స్మార్ట్ ప్లస్ ఆవిష్కరిస్తున్న సంస్థ నిర్వాహకులు

డిష్ టీవీ సరికొత్త ఆఫర్ 'డిష్ టీవీ స్మార్ట్ ప్లస్'

అడయార్, ఏప్రిల్ 28: ప్రైవేట్ శాటిలైట్ నెట్‌వర్క్ డిష్ టీవీ తమ కస్టమర్ల కోసం ఇపుడు సరికొత్త ఆఫర్‌తో ముందుకు వచ్చింది. డిష్ టీవీ స్మార్ట్ ప్లస్ పేరుతో దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద సర్వీస్ పొందినట్టయితే, ఎక్కడైనా ఎలాంటి స్క్రీన్‌పైన అయినా టీవీ, ఓటీటీ సేవలను పొందవచ్చని డిష్ టీవీ ఇండియా సీఈవో మనోజ్ దేబాల్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆఫర్ కింద కాంప్రెహెన్సివ్ ఎంటర్‌టైన్మెంట్ ఎకోసిస్టమ్ కింద కంటెట్, డివైసెస్, ఎనీ స్క్రీన్, ఎనీ వేర్ అనే ఆఫర్ ఇవ్వనుంది. అలాగే, ఈ ఆఫర్ ఎంచుకునే కస్టమర్లకు పాపులర్ యాప్స్ కూడా పొందవచ్చన్నారు.

ఘనంగా అరుళ్‌వొళి సంఘ వార్షికోత్సవం

ప్యారీస్, ఏప్రిల్ 28: నగరంలోని అరుళ్‌వొళి ఉరవిన్ మురై సంక్షేమ సంఘం 37వ వార్షికోత్సవం ఆదివారం రాయపేటలోని శర్మాణి హాలులో ఘనంగా జరిగింది. సంఘ అధ్యక్షుడు డా.జి.కృపానందం అధ్యక్షతన వహించిన ఈ వేడుకల్లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, కలెక్టర్లు, విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, దళిత సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా అరుళ్‌వొళి సంఘ వ్యవస్థాపకులు కేఎస్ జగన్నాథన్-జయలక్ష్మి దంపతుల చిత్రపటాలకు, రాజ్యాంగ నిర్మాణశిల్పి బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.మణివన్నన్ మాట్లాడుతూ... అరుంధతీయులు ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో అరుళ్‌వొళి సంఘం కృషిచేస్తోందని ప్రశంసించారు. తమిళనాడు ప్రభుత్వం 2009లో 18 శాతం ఎస్సీ రిజర్వేషన్ నుంచి అరుంధతీయులకు 3 శాతం అంతర్గత రిజర్వేషన్ కల్పించిన వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఏడుగురు న్యాయమూర్తుల బెంచ్ పరిశీలనలో ఉందని, త్వరలోనే అరుంధతీయులకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశముందన్నారు. అనంతరం చెన్నై జిల్లా రిటైర్డ్ కలెక్టర్ జి.గోవిందరాజు మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వ ఉద్యోగ సబ్ ప్లాన్ పథకం ద్వారా అరుంధతీయులకు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుళ్‌వొళి సంఘం ద్వారా గత 36 ఏళ్లలో 457 జంటలకు సామూహిక వివాహాలు జరిపించిన సంఘ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ డా.ఆర్.ఆనందరాజ్ సేవలను కొనియాడుతూ జ్ఞాపిక బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో ప్లస్ టూ విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక నవీన స్వయంవరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు, కేఎస్‌జే శివకుమార్, వి.సెల్వరాజ్, పి.కాళిముత్తు, ఆర్.శరవణన్ తదితరులు పాల్గొన్నారు. చివరగా ఆహూతులందరికి మొక్కలు పంపిణీ చేశారు.


అరుళ్‌వొళి ఆనందరాజ్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న ప్రముఖులు

చిత్రజ్యోతి

అరణ్మనై-4 యాక్షన్ సన్నివేశాల్లో నటించడం థ్రిల్ : తమన్నా

సుందర్ సి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'అరణ్మనై-2' చిత్రంలో భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉందని హీరోయిన్ తమన్నా అన్నారు. ఈ చిత్రంలో పనిచేసిన అనుభవాన్ని ఆమె తన ట్విటర్ ఖాతాలో షేర్ చేశారు. 'అరణ్మనై-2' చిత్రంలో నటించడం చాలా సవాల్‌తో కూడుకున్న పని. ఎంతో శ్రమకోర్చి స్టంట్ సన్నివేశాల్లో కూడా నటించి థ్రిల్ ఫీలయ్యానన్నారు.. ఈ ప్రాజెక్టులో ఒక భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది' అని పేర్కొన్నారు. అలాగే, ఈ సినిమా సెట్‌లో తాను తీసుకున్న ఆహార పదార్థాలను కూడా ఆమె ఫొటోలు తీసి షేర్ చేశారు. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



తండ్రీకొడుకుల భావోద్వేగ చిత్రం 'రామం రాఘవం'

● టీజర్ రిలీజ్

'జబర్దస్త్' ఫేం ధన్‌రాజ్ కొరణాని దర్శకత్వం వహించిన చిత్రం 'రామం రాఘవం'. సముద్రఖని, ధన్‌రాజ్ ప్రధానపాత్రలు పోషించారు. తమిళ, తెలుగు భాషల్లో తెరకెక్కించిన ఈ చిత్రం టీజర్‌ను శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. స్లేట్ పెన్సిల్ స్టోరీస్ పతాకంపై ప్రభాకర్, ఆరిపాక సమర్పణలో పృథ్వీ పోలవరం నిర్మించారు. ఈ టీజర్ రిలీజ్ కార్యక్రమంలో సముద్రఖని మాట్లాడుతూ, 'నేను వందకుపైగా చిత్రాల్లో తండ్రి పాత్ర పోషించాను. అవన్నీ విభిన్న కథాంశాలతో తెరకెక్కాయి. అలాంటి మరో కొత్త కథే ఇది. ధన్‌రాజ్‌కు తల్లిదండ్రులు లేరు. స్వతహాగా, ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నాడు. మంచి కథ ఇది. అందుకు తగిన దర్శకుడు ఉండాలని అనుకున్నాం. అయితే, ధన్‌రాజ్‌పై ఉన్న నమ్మకంతోనే దర్శకత్వం చేయాలని సలహా ఇచ్చా. ఒక దర్శకుడిగా ఆయన పెద్ద విజయాన్ని అందుకుంటారు. ప్రతి తండ్రీ కుమారుల మధ్య ఉండే బంధాన్ని చాటి చెప్పే చిత్రమిది. తప్పకుండా విజయం సాధిస్తుంది' అన్నారు. దర్శకుడు ధన్‌రాజ్ మాట్లాడుతూ, 'రచయిత శివప్రసాద్ కలం నుంచి జాలువారిన ఈ కథను సముద్రఖనికి చెప్పారు. వెంటనే ఆయన నువ్వే డైరెక్ట్ చేయాలని సూచించారు. నేను నటించిన చిత్రాలకు దర్శకత్వం వహించిన దర్శకుల నుంచి నేర్చుకున్న అంశాల ఆధారంగానే ఈ చిత్రానికి దర్శకత్వం వహించాను. ఇప్పటివరకు వందకుపైగా చిత్రాల్లో నటించాను. వారందరూ నాకు గురువులే. సముద్రఖని లేకుండా ఈ చిత్రం ఇంత అద్భుతంగా వచ్చేది కాదు. ప్రతి ఒక్కరూ తమతమ తండ్రులతో కలిసి ఈ సినిమా చూడాలని కోరుతున్నానన్నారు. ఈ చిత్రంలో సముద్రఖని, ధన్‌రాజ్‌లతో పాటు హరీష్ ఉత్తమన్, సత్య, మోక్ష సెంగుప్త, శ్రీనివాస రెడ్డి, పృథ్వీరాజ్, ప్రమోదిని తదితరులు నటించారు.


'రామం రాఘవం'లో ధన్‌రాజ్, సముద్రఖని

'విడుదలై' రెండో భాగంలో ఆయన పాత్ర సంపూర్ణం

జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ డెరక్షన్‌లో సూరి, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'విడుదలై'. తొలి భాగం విడుదలై ఘన విజయం సాధించగా ఇపుడు రెండో భాగం రూపుదిద్దుకుంటుంది. తొలి భాగంలో కానిస్టేబుల్‌గా సూరి కనిపించారు. అధ్యాపకుడి పాత్రలో విజయ్ సేతుపతి నటించారు. ఈ చిత్రం నిర్మాణంపై హీరో సూరి మాట్లాడుతూ, 'మొదటి భాగంతో పోల్చితే రెండో భాగం ప్రతి ఒక్కరినీ నచ్చుతుంది. నిర్మాణ పనులు అంతిమ దశకు చేరుకున్నాయి. రెండో భాగం చాలా అద్భుతంగా వచ్చింది. నిర్మాణం నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే సాగితున్నాయి. రెండో భాగంలో విజయ్ సేతుపతి పాత్ర కీలకంగా ఉంటుంది. తొలి భాగంతో పోల్చితే రెండో భాగంలో విజయ్ సేతుపతి పాత్ర నిండుదనంతో ఉంటుంది' అని పేర్కొన్నారు.


సూరి





మిస్ రమణయ్య

ఇదీ మందు



'అదృష్టం ముందు తలుపు తడుతూవుంటే దురదృష్టం వెనుక తలుపు తోసుకుని వచ్చేసింది' అనే సామెత సూళ్లూరుపేటలో ఒక తెలుగుదేశం వీరాభిమాని విషయంలో నిజం అయ్యింది. 1989లో టీడీపీ టికెట్ల కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు అని ఎన్టీయార్ ప్రకటించారు దరఖాస్తుల కట్ట చేతబట్టుకుని స్థానిక టీడీపీ బాధ్యుడు హైదరాబాదుకి బయలుదేరారు. సమాచారం తెలిసి సూళ్లూరుపేటలో మెస్ నడుపుకునే టీడీపీ కార్యకర్త నూలేటి వెంకట రమణయ్య పరుగున రైల్వేస్టేషన్‌కి చేరుకుని తన దరఖాస్తు కూడా అందించారు. ఆ తర్వాత టీడీపీ జాబితా ప్రకటించారు. సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థిగా ఎన్టీయార్ మెస్ రమణయ్య పేరు ప్రకటించారు. అదృష్టం నీ మెస్‌ని వెతుక్కుంటూ వచ్చింది పో అంటూ అందరూ ఆయనను అభినందనలతో ముంచెత్తారు. ఆ తర్వాతే అదృష్టం అడ్డం తిరిగింది. ఓటర్ల జాబితాలో రమణయ్య పేరే లేదని బయటపడింది. కొత్తగా నమోదు చేసుకునే అవకాశమూ లేకపోయింది. దాంతో రమణయ్య బదులుగా సట్టి ప్రకాశం పేరు జాబితాలోకి ఎక్కింది. ఉసూరుమంటూ రమణయ్య తిరిగి మెస్‌లోకి నడిచారు. జాబితాలో తమ ఓటు ఉందా లేదా అన్నది చూసుకోవడం ఎంత ముఖ్యమో ఈ సంఘటన చెంపపెట్టులా చెప్పింది.

- తడ

బోరుమంటున్న బీరు బాబులు



తిరుపతిలో బీరు ప్రియులకు గొప్ప చిక్కొచ్చి పడింది. బయట ఎండలు మండిపోతుంటే చల్లగా బీరు తాగుదామని వెళ్తే స్టాక్ లేదనే మాట విని నిరాశ పడిపోతున్నారు. ఎప్పుడూ లేని కొరత ఇప్పుడేంటా అని మండిపడుతున్నారు. అసలేం జరుగుతోందంటే తిరుపతిలో దాదాపు 16 బార్లున్నాయి. బారుకు కనీసం ఒక్కో బ్రాండుకు చెందిన 400 బాక్సుల బీర్లు అవసరముంటాయి. బాక్సులో 12 బాటిళ్లు ఉంటాయి. నగర బార్లలో అత్యధికం అధికార వైసీపీకి చెందిన వారివే. ఎన్నికల ప్రచారం మొదలయ్యాక బార్ల నిర్వాహకులు తమ పార్టీ నాయకుల కోరిక మేరకు అడిగిన చోటకు అడ్డదారుల్లో స్టాకు తరలిస్తున్నారని సమాచారం. గత ఏడాది ఇదే నెలలో జరిగిన అమ్మకాల ప్రకారం సరిచూసి 30 శాతం అదనంగా స్టాకు రిలీజ్ చేస్తున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరామ్ చెబుతున్నారు. కానీ స్టాకులో 70 శాతం బీర్లు వైసీపీ నాయకుల కనుసన్నల్లోకి మళ్లిపోతున్నాయి. డిమాండ్‌లో సగం కూడా తమకు ఇవ్వడం లేదని వైసీపీయేతర బార్ల నిర్వాహకులు చెపుతున్నారు. దీంతో బీరులకు కొరత ఏర్పడింది. చేసేదేం లేక కొందరు చీప్ లిక్కర్ వైపు మొగ్గు చూపుతున్నారు. బార్లపైన ఎక్సైజ్ శాఖకు అజమాయిషీ లేకపోవడం, సెబ్‌కు సిబ్బంది కొరత ఉండడంతో బీరు ప్రియులకు కష్టాలు తప్పడం లేదు.

- తిరుపతి(నేరవిభాగం)

నోట్ దిస్ పాయింట్

ప్రచారంలో నోరు పారేసుకుంటే జైలే



ప్రచారంలో నోరు అదుపులో పెట్టుకోకపోతే ఇబ్బందేనంటోంది ఎన్నికల నియామవళి. అభ్యర్థులే కాదు రాజకీయనేతలందరికీ ఈ రూలు వర్తిస్తుంది. వ్యక్తిగత విమర్శలు చేస్తే కటకటాల పాలు కాకతప్పదని హెచ్చరిస్తోంది. వ్యక్తిగత, కులం, వర్గం, మతం, ప్రాంతం పేరుతో రెచ్చగొట్టే వ్యాఖ్యలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు రూపొందించింది. పైన ప్రస్తావించిన అంశాలకు సంబంధించి నోరుజారితే ఆర్పీ చట్టం 1951సెక్షన్ 125 ఐపీసీ, 153ఏ ఐపీసీ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసినా శిక్షార్హులే. మద్యం, డబ్బులు పంపిణీ చేసినా, తీసుకున్నా నేరస్తులుగా పరిగణిస్తారు. ఐపీసీ 171బి, 171 ఈ ప్రకారం ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రచారంలో లౌడ్ స్పీకర్లు వాడినా, ప్రత్యర్థులను ఇష్టమొచ్చినట్లు రెచ్చగొట్టేలా మీడియా సమావేశాలు పెట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర నేరంగా పరిగణిస్తారు సుమా..

- తిరుపతి(నేరవిభాగం)



శెట్టిపల్లె భూములు



తిరుపతి - ఆంధ్రజ్యోతి

శరగోపం పెట్టేశారు

దశాబ్దాల వివాదంతో వైసీపీ గేమ్స్

శెట్టిపల్లి భూమి సమస్య అనే మాట తరచూ వార్తల్లోకి వస్తూ ఉంటుంది. తరాలుగా భూములకు యజమానులైన ప్రజలకు ఆ భూములపై హక్కులు లేకపోవడమే శెట్టిపల్లి సమస్య. ప్రభుత్వం తలచుకుంటే హక్కులు ఇచ్చేయడం సులభమే. అయితే ఈ భూముల విలువ బంగారంతో పోటీపడడంతోనే అందరి కన్నూ శెట్టిపల్లిమీద పడింది. పాత రికార్డుల్లో 636 ఎకరాలని ఉన్నా అమ్మకాలూ కొనుగోళ్లూ, సీఆర్ఎస్‌కు కేటాయింపులూ వంటివి పోగా ఇంకా 550 ఎకరాలు అక్కడ ఉన్నాయి. ఒక ఎకరా రిజిస్ట్రేషన్ విలువ ఇక్కడ రూ. 65 లక్షలున్నా.. మార్కెట్ విలువను 1.4 కోట్లుగా పేర్కొన్నారు. వాస్తవానికి తిరుపతి నగరంలో దాదాపుగా భాగమైన ఈ భూమి ఎకరా రూ. 3 నుంచి 5 కోట్లు చేస్తుంది. ఈ లెక్కన ఇది రూ. 2000 కోట్ల విలువైన భూమి. ఈ విలువే శెట్టిపల్లి ప్రజలకు శాపంగా మారింది. మీకు కొంత .. మాకు కొంత పద్ధతిలో అభివృద్ధి చేస్తామంటూ టీడీపీ పాలనలో ప్రభుత్వమూ.. ఆ తర్వాత వైసీపీ పాలనలో తుడ, కార్పొరేషన్‌లు పోటీలు పడ్డాయి. అభివృద్ధి అంటూ జరిగితే తమకు కొనే, అమ్మే హక్కులు వస్తాయనీ, తమ భూమి విలువా పెరుగుతుందని ఆశపడ్డ శెట్టిపల్లి వాసులతో వైసీపీ నాయకులు ఆడుకున్నారు. అద్భుతాలు జరుగుతాయని కళ్లకు కడుతూ అబద్ధాలు చెప్పారు. చివరికి ఏమీ చేయకుండానే కాలం గడిపేశారు. వైసీపీ వంచన పరిణామాల పరంపర ఇలా కొనసాగింది...

శెట్టిపల్లి సమస్య ఇదీ..



శెట్టిపల్లె గ్రామం

తిరుపతి నగర పరిధిలోని శెట్టిపల్లె గ్రామంలో 636 ఎకరాల భూమి ఉంది. అనాదిగా 500 కుటుంబాల అధీనంలో ఈ భూమి ఉంది. ఈ భూమిలో వారు వ్యవసాయం చేసుకునేవారు. 3-5-1979లో ఇనామ్ చట్టం రద్దు అయిన ఏడాది జూన్ 25న శెట్టిపల్లి గ్రామం ఏర్పడింది. 1980-81 మధ్య కాలంలో సాగుబడిని అనుభవంగా పరిగణనలోకి తీసుకున్న అప్పటి కలెక్టర్, గట్టువారీ సర్వే నిర్వహించి అనుభవదారులకు రఫ్ పట్టాలను మంజూరు చేశారు. ఆ పట్టాల ఆధారంగానే భూమి హక్కుదారులుగా ఉండేవారు. ఈక్రమంలోనే క్రయవిక్రయాలు కూడా పెద్దఎత్తున జరిగాయి. ఈనేపథ్యంలోనే శెట్టిపల్లె భూముల్లోని 82.67 ఎకరాలను రైల్వే శాఖ తిరుపతి క్యారేజ్ రిపేర్ షాప్ నిర్మాణం కోసం రైతులకు పరిహారం చెల్లించి మరీ భూములు తీసుకుంది. అంతేకాకుండా భూములు కోల్పోయిన ప్రతి ఇంటికి సీఆర్ఎస్‌లో ఒక ఉద్యోగాన్ని కల్పించింది. అయితే 2007-08లో అప్పటి జాయింట్ కలెక్టర్ శెట్టిపల్లె భూముల్లో సర్వే నిర్వహించి, వీటిని ప్రభుత్వ భూములుగా రికార్డుల్లోకి ఎక్కించారు. ఇక్కడి నుంచీ వివాదం మొదలైంది. దీనిపై పలువురు హైకోర్టుకు వెళ్లినా కూడా లాభం లేకుండా పోయింది. అమ్మే, కొనే హక్కులు కోల్పోయిన ఈ భూ యజమానులు ఆందోళనతోనే గడుపుతున్నారు. తాజాగా 270 ఎకరాల భూమిని 348 మంది రైతుల అనుభవంలోనూ, తక్కిన భూమి ఇళ్లు, లేఅవుట్ల రూపంలో 2448మంది అనుభవంలోనూ ఉన్నట్టు గుర్తించారు. ఈ విలువైన భూములను అభివృద్ధి పరచి లేఅవుట్లు వేసి రోడ్లు ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నది ఆలోచన. వ్యవసాయ భూములైతే రైతులకు 30శాతం కార్పొరేషన్‌కి 70 శాతం వంతున, కమర్షియల్ అయితే 40/60 విధానంలో పంపిణీ చేస్తామని చెప్పి ఖాళీ ప్రొసీడింగ్స్ ప్రజల చేతుల్లో పెట్టారు. ఈ విధంగా చేయడం వల్ల కార్పొరేషన్‌కి 120 నుంచి 150 ఎకరాలు లభిస్తుందని భూమన తండ్రీకొడుకులు అభిప్రాయపడ్డారు. చివరికి శెట్టిపల్లి ప్రజలకు ఉత్త చేతులు చూపించేశారు.

తుడా స్కెచ్ వేసింది

2020 జనవరి: శెట్టిపల్లి వద్ద అద్భుతమైన టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టాలని తుడా ఛైర్మన్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి యోచన చేసి కార్యచరణ మొదలు పెట్టారు. శెట్టిపల్లి భూములకు సంబంధించి 2020 జనవరిలో ఒక నోటిఫికేషన్ జారీ చేశారు. పాత, కొత్త రికార్డుల ఆధారంగా ఉన్న 636 ఎకరాల భూములు తదితర వివరాలను పొందుపరిచారు. భూ సేకరణ ద్వారా సీఆర్ఎస్‌కు కేటాయించిన భూములు మినహాయించి, ప్రభుత్వ భూములు, కుంటపోరంబోకు, కాలువ పోరంబోకు, రస్తా పోరంబోకు స్థలాలను ప్రకటనలో పొందుపరిచారు. అభ్యంతరాలు ఉంటే స్వీకరించేందుకు తుడా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులో ఉంచారు. తుడా, రెవెన్యూ అధికారులతో కూడిన ఓ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. అవసరమైతే తుడా ఆస్తులను సైతం బ్యాంకుల్లో తనఖా పెట్టైనా రుణం తెచ్చి టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. డిప్యూటీ కలెక్టర్ పర్యవేక్షణలో శెట్టిపల్లి భూముల విషయంలో అనుభవం కలిగిన విశ్రాంత తహసీల్దారులను నియమించారు. అయితే కొవిడ్ తర్వాత ఇదంతా మూలన పడింది.

కార్పొరేషన్ కాజేయాలనుకుంది

"మూడు నెలల్లో మీరు అనుకున్న దానికన్నా ఎక్కువే చేస్తాం.

● తన నివాసంలో శెట్టిపల్లి భూ బాధితులతో 2019 జూన్ 24న ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి

ఆ తర్వాత శెట్టిపల్లి కథ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలో మున్సిపాల్టీకి చేరింది. ఆగమేఘాలపై శెట్టిపల్లి ఫైళ్లు పరుగులు పెట్టాయి.

1-8-2021: కౌన్సిల్ సమావేశంలో శెట్టిపల్లి విలీనం అంశాన్ని ప్రస్తావించారు. తనకు మాటమాత్రం అయినా చెప్పకుండానే అజెండాలోకి ఎలా చేర్చారని మేయర్ శిరీష అసంతృప్తి వ్యక్తం చేశారు. శెట్టిపల్లిను తుడాకు అప్పగిస్తే లేఅవుట్లు వేసుకుని డబ్బుచేసుకుంటుంది తప్ప మరో కార్యక్రమం ఉండదని డిప్యూటీ మేయర్ అభినయరెడ్డి వ్యాఖ్యానించారు. విలీనం చేసుకుంటే ఆస్తులు పెద్దగాలేని కార్పొరేషన్‌కు దాదాపు 120 ఎకరాలు ఆస్తులుగా రానున్నాయని విలీనం వెనుక రహస్యం చెప్పారు.

28-9-2021: శెట్టిపల్లి భూముల సమస్యలపై ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి రెవెన్యూ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. శెట్టిపల్లిని కార్పొరేషన్‌లో విలీనం చేయాలంటూ పంచాయితీ తీర్మానం కావాలని సూచన చేశారు.

29-9-2021: శెట్టిపల్లి పంచాయితీలోని శెట్టిపల్లి, శెట్టిపల్లి హరిజనవాడ, సీఆర్ఎస్ క్వార్టర్స్, ఉప్పరపాళెం, వినాయకనగర్‌లను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని కోరుతూ పంచాయితీ తీర్మానం చేసింది. అదేరోజు కమిషనర్‌కు ఆ కాపీ చేరింది.

30-9-2021: జరగబోయే కౌన్సిల్ సమావేశపు అజెండాలో శెట్టిపల్లిని విలీనం చేసుకునే అంశాన్ని చేర్చారు.

3-12-2021: తిరుపతి పర్యటనకు వచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డిని శెట్టిపల్లి బాధితులు కలిసి తమ గోడు చెప్పుకున్నారు. ఆయన పక్కనే ఉన్న కలెక్టర్‌ను పిలిచి సమస్యను పరిష్కరించండి అని చెప్పి వెళ్లిపోయారు.

27-9-2022: తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి వచ్చిన సీఎం జగన్ రెడ్డిని నానాతంటాలు పడి మరోసారి శెట్టిపల్లె ప్రజలు కలిశారు. సేమ్ సీన్ రిపీట్. పక్కనే ఉన్న కలెక్టర్‌కు అప్పగించి వెళ్లిపోయారు.

2-11-2023: శెట్టిపల్లి సమస్యలను పరిష్కరించేశామని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పెద్ద మీటింగ్ పెట్టారు.

3-11-2023: కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులు, మేయర్, డిప్యూటీ మేయర్ల సమక్షంలో ప్రొసీడింగ్స్ చేతిలో పెట్టారు. శెట్టిపల్లికి నిజమైన పండుగ వచ్చిందని గొప్పలు చెప్పుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చే భూ భాగంతో సాఫ్ట్‌వేర్ కంపెనీలను తీసుకొస్తామన్నారు. **8-2-2024:** ప్రొసీడింగ్స్ కాపీలు అందుకున్నవారు స్థలంలోకి దిగితే రెవెన్యూవాళ్లు అడ్డుకుని వెనక్కి పంపుతున్నారు.

మాటతో మోసం చేశారు

శెట్టిపల్లి పంచాయితీ ఎన్నికలు జరిగి పదవుల్లోకి వచ్చిన ఏడాది కాలంలోనే తమ భూ సమస్య పరిష్కారం అవుతుందన్న వైసీపీ నేతల మాటలతో పంచాయితీని కార్పొరేషన్లో విలీనం చేసేందుకు సిద్ధమయ్యారు. వారి మాటలు నమ్మి సర్పంచ్ పదవులు త్యాగం చేసి రాత్రికి రాత్రే తీర్మానాలు చేసి కార్పొరేషన్లో కలిసిపోయారు. సెటిల్ చేసే క్రతువును దిగ్విజయంగా పూర్తిచేశామంటూ రైతులకు ఖాళీ ప్రొసీడింగ్స్ చేతిలో పెట్టారు. అందులో లేఅవుట్ వేసి, ప్లాట్ నెంబర్లు నమోదు చేయలేదు. అభివృద్ధి మాటలు అమలు కాకపోవడంతో నేతలను అడిగితే, లేఅవుట్ డెవలప్మెంట్ కోసం బెంగుళూరు వాళ్లకు కాంట్రాక్ట్ ఇచ్చామని, ఎన్నికల తర్వాత చేసేస్తామని తాపీగా చెప్పారు. పంచాయితీ పాలకమండలిని కూడా కోల్పోయి, ఊరించి ఉసూరుమనిపించడంతో శెట్టిపల్లి ప్రజలు ఆవేదనతో రగిలిపోతున్నారు.



ఆర్థిక నగరిగా చంద్రబాబు విజన్

2018: శెట్టిపల్లె పంచాయతీ పరిధి తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఉండటంతో టీడీపీ నేతలు సుగుణమ్మ, పులివర్తి నానిలు ప్రత్యేక చొరవ తీసుకుని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దాలుగా మగ్గుతున్న ఈ సమస్య పరిష్కారానికి ఒక ప్రణాళికను ప్రభుత్వం ప్రతిపాదించింది. 30 శాతం భూములు రైతులకు, 70 శాతం భూములు ప్రభుత్వం తీసుకుని ఈప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. 2018లోనే కేబినెట్‌లో ఆమోదముద్ర కూడా పడింది. శెట్టిపల్లిని ఎకనమిక్ జోన్‌గా తీర్చిదిద్దడం చంద్రబాబు ఆలోచన. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయనేది ఆయన భావన. ఉన్న భూముల్లో ఓ వైపు ఆర్థిక నగరం, మరోవైపు రైతులకు, ప్లాట్ల కొనుగోలు దారులకు భూములు, స్థలాలను అందించేలా ప్లాన్ చేశారు. ఆర్థిక నగరంగా తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని శెట్టిపల్లి ప్రజలు కూడా సంతోషపడ్డారు. అయితే 2019 ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోవడంతో దీనిని వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది.

అసలు 2012లోనే ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబునాయుడు శెట్టిపల్లెలో పర్యటించారు. భూముల సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. 2018-19లో అప్పటి కలెక్టర్ ప్రద్యుమ్న చొరవతో రెవెన్యూ బృందాన్ని ఏర్పాటు చేసి దాదాపు రెండు నెలల పాటు సర్వే నిర్వహించి రికార్డులను సేకరించారు. శెట్టిపల్లె గ్రామం, భూముల్లో పర్యటించి రైతులు, ప్లాట్ల కొనుగోలుదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి భూముల వాస్తవ పరిస్థితులను వారికి వివరించారు.

బాబు కోసం నేను సైతం



తాను ఉద్యోగిగా స్థిరపడటానికి బాటలు వేసిన ప్రియతమ నేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యే దాకా నల్లచొక్కానే ధరిస్తానని ప్రతినబూనాడో యువకుడు. ఏర్పేడు మండలం గోవిందరం గ్రామానికి చెందిన అబ్బూరి రమేష్ 2012 నుంచి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నాడు. మంచి శాలరీ ప్యాకేజీనే తీసుకుంటున్నాడు. చంద్రబాబునాయుడు ముందుచూపుతో సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రోత్సహించడం వల్లే తనకు ఉద్యోగం వచ్చిందని రమేష్ బలంగా నమ్ముతాడు. అందుకే ఆయనంటే అమితాభిమానం. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని భావిస్తూ తాజాగా ప్రచారం రంగంలోకి దిగాడు. సాఫ్ట్‌వేర్ కొలువుకు సెలవుపెట్టి మరీ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే వరకు తాను నల్ల చొక్కానే ధరిస్తానంటున్నాడు.

- ఏర్పేడు

మీటింగ్‌కు వస్తే చికెన్ మీల్స్...



చంద్రగిరి మండలంలో మీటింగులకు జన సమీకరణ నాయకులకు తలనొప్పిగా మారింది. మొక్కుబడిగా కాసేపు కూర్చుని వెళితే చాలని బతిమలాడినా జనం ముఖం చాటేస్తున్నారు. దీంతో .చికెన్ భోజనం ఉంది.. రండంటూ ఆఫర్ ఇస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో అన్ని రాజకీయ పార్టీల నాయకులు గ్రామాల్లో బల నిరూపణకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎండలు దంచేస్తుండటంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడంలేదు. కొంతమంది తటస్థంగా ఉంటూ కనిపించకుండా తిరుగుతున్నారు. ఈక్రమంలోనే తమ నేత ముందు బల నిరూపణకు చిన్నాచితకా నాయకులు నానా తంటాలు పడుతున్నారు. మహిళలకు కూల్ డ్రింక్స్, పురుషులకు మద్యం ఆఫర్ చేస్తున్నారు. అంతేకాదండోయ్ చికెన్ భోజనం కూడా ఉందని నోరూరిస్తున్నారు. ఇంట్లో జరిగే శుభకార్యాలకు పిలిచినట్లుగా గ్రామ నాయకులు ఆహ్వానిస్తున్నారు. ఇన్ని ఆఫర్లు ఇస్తున్నా మీటింగులకు జన స్పందన అంతంతమాత్రంగానే ఉంటోందని నాయకులు ముఖం చిట్లిస్తున్నారు.

- చంద్రగిరి